

లోపలి పేజీల్లో...

ఖానాపురం నుంచి మున్నేరు వరకు... 36 అడుగుల అలుగు పునరుద్ధరణకు చర్యలు 6

కేంద్రీకృత పాలన కోసమే జమిలి సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నేత పి.రంగారావు 7

రుణమాఫీకి పెరుగుతున్న అర్హులు తెల్ల రేషన్‌కార్డు లేని వారు 15 వేల మందికి పైనే... 6



కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో...



కేంద్ర ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్‌పాశ్వాన్‌తో...



కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడితో...

కలుసుకుంటూ.. వినతులు తెలుపుకుంటూ..

- కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు, తెలంగాణలో కొబ్బరి పరిశ్రమ బోర్డు ఏర్పాటు చేయండి..
- వరదల నష్టానికి సాయం అందించండి..
- బుగ్గపాడు ఫుడ్‌ప్రాసెసింగ్‌కు సహకరించండి..
- ముగ్గురు కేంద్రమంత్రులకు తుమ్మల వినతి

ఖమ్మం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఢిల్లీలో జిల్లా సమస్యలతోపాటు రాష్ట్ర సమస్యలపై పలువురు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించారు. పలు సమస్యల పరిష్కారానికి కూడా హామీలు పొందారు. ప్రధానంగా ఇటీవల ఖమ్మం జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి ఆయిల్‌పామ్ దిగుమతి సుంకాన్ని పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ టన్నుకు రూ.20వేలు కనీస మద్దతు ధర ఉండాలని విజ్ఞప్తిచేశారు. తద్వారా ధర తగ్గినా రైతులకు కనీసమద్దతు ధరకు ఆయిల్‌పామ్ అమ్ముకునే సౌలభ్యం ఉంటుందని తెలిపారు. దీనివల్ల జిల్లాలో ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ఉపయోగం కలగనుంది. ఇటీవల రాష్ట్రంతోపాటు ఖమ్మం జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని ప్రత్యక్షంగా చూసినందున కేంద్ర నుంచి రాష్ట్రానికి ఇతోధికంగా సహాయం అందించాలని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

ఉమ్మడి రాష్ట్రంలో కొబ్బరి పరిశోధన బోర్డు ఆంధ్రాకు వెళ్లినందున తెలంగాణకు కూడా కొబ్బరి పరిశ్రమ బోర్డు ఏర్పాటుచేయాలని అశ్వారావుపేటలో హార్టికల్చర్‌కు సంబంధించిన ఎక్సలెన్సు సెంటర్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఇందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి స్పందిస్తూ ఆయిల్‌పామ్ ఎంఎస్‌పీ ధర నిర్ణయంపైనా సమావేశం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగూడెం ఎయిర్‌పోర్టుతో పాటు తెలంగాణలోని పలు ఎయిర్‌పోర్టుల సమస్యలపై కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడిని కలిసి విన్నవించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు సంబంధించి భూములు, ఇతర వనరులు అందుబాటులో ఉంటే వెంటనే మంజూరుచేస్తామని, ఇందుకు త్వరలోనే ఒక బృందాన్ని కొత్తగూడెం పంపుతామని హామీ ఇచ్చారు. కేంద్ర ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్‌పాశ్వాన్‌ను కలిసి తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతోపాటు బుగ్గపాడులో ఏర్పాటు చేసిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు కేంద్రంనుంచి అవసరమైన సహకారం అందించాలన్నారు. అందుకు ఆయన కూడా తగిన హామీ ఇచ్చారు. అలాగే మంత్రి తుమ్మల ఢిల్లీలో ఏర్పాటుచేసిన డెలాయిట్ ఎక్స్‌పో ఫుడ్‌ప్రాసెసింగ్ ఎక్స్‌పో సదస్సుకు రాష్ట్రం నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా హాజరై ప్రసంగించారు. ఒకేరోజు జిల్లాకు, రాష్ట్రానికి సంబంధించిన కేంద్రం పరిధిలోని పలు సమస్యలను మంత్రి తుమ్మల కేంద్రమంత్రుల వద్ద ప్రస్తావించి పరిష్కారానికి భరోసా పొందారు.

అకాల వర్షాలతో కొట్టుకుపోయిన సాగర్ ఎడమకాల్వ మరమ్మతులు శరవేగంగా సాగుతున్నా.. గతవారం రోజుల నుంచి ఎండతీవ్రత పెరగడంతో నీరందక వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఇటీవలి వరదల మూలంగా సాగర్ ఎడమకాల్వ 132 కిలో మీటరు వద్ద సుమారు 200మీటర్ల వెడల్పులోనూ, దానికి ఎదురుగా అండర్ టన్నెల్ గోడలు కూలిపోయిన సంగతి తెలిసిందే. రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని 24గంటలపాటు అధికారులు మరమ్మతుల పనులు కొనసాగిస్తున్నా.. నీటిపారుదల శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం, క్షేత్రస్థాయిలో కొన్ని అవరోధాలు రావడం, పరిస్థితులు అనుకూలించకపోవడంతో మరో నాలుగు రోజుల వరకు సాగునీరు విడుదల చేసే అవకాశం లేదు. దీంతో వేసిన పంటలు చేతికి వస్తాయో.. లేదోనని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

అన్నదాత అరిగోస



నేలకొండపల్లి మండలం అనాసాగరంలో నెర్రెలు బారిన పొలంలో ఎండిన వరి కంకిని చూపుతున్న రైతు వెంకటనారాయణ

రైతుల కంట కడ'గండ్లు'

కొనసా...గుతున్న సాగర్ ఎడమ కాల్వ గండ్ల మరమ్మతులు

- సాగునీరందక నెర్రెలు బారుతున్న వరి పొలాలు
- 2.50 లక్షల ఎకరాల్లో సాగర్ ఆయకట్టుకు ముప్పు
- భారీ వర్షాలతో కాల్వకు రెండు చోట్ల గండ్లు
- మట్టి లభ్యత లేకపోవడంతో పనుల ఆలస్యం
- ఐబీ అధికారుల సమన్వయలోపం మరో కారణం
- సాగునీరు రాక ఆయకట్టు రైతుల ఆందోళన
- ఎల్లుండి విడుదల చేస్తామంటున్న ఐబీ అధికారులు

కూసుమంచి/కల్లూరు, సెప్టెంబరు 19: సాగర్ ఎడమకాల్వ మరమ్మతులకు మట్టి లభ్యత లేకపోవడంతో పనుల పూర్తిలో ఆలస్యమవుతోంది. ఇటీవల ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారికి చుట్టు పక్కల మట్టిని తీసుకెళ్లడంతో గుట్టలన్నీ ఖాళీ అయ్యాయి. ఇప్పుడు కాల్వ మరమ్మతులకు మట్టి లభ్యత లేకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని గంగబండతండ సమీపంలో ఎస్సారెస్పీ మట్టిని ప్రస్తుతం తరలిస్తున్నారు. అదేవిధంగా నేలపట్ల, అగ్రహారం ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తున్నారు. అదేవిధంగా కాల్వపైనుంచి టిప్పర్లు వెళ్లాల్సి రావడం, చుట్టూ పంటపొలాలు ఉండటంతో కొంత ఇబ్బందిగా మారింది. అండర్ టన్నెల్ గోడ కూలడంతో ప్రస్తుతం సీసీ పనులు కొనసాగుతున్నాయి. అది పూర్తయిన వెంటనే కాల్వకట్ట మట్టి పనులు సగం వరకు పూర్తయినా.. వెంటనే నీరు విడుదల చేయాలని అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శనివారం రాత్రికి తాత్కాలిక పనులు పూర్తిచేసి ఆదివారం నీరు విడుదల చేయాలని ప్రయత్నం చేస్తున్నారు.



మల్లాయిగూడెం వద్ద సాగర్ ఎడమకాల్వ మరమ్మతులు

2.50లక్షల ఎకరాల్లో పంట ప్రశ్నార్థకం

సాగర్ ఎడమకాల్వ మరమ్మతులు ఆలస్యం అవుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. జిల్లాలో సుమారు 2.50లక్షల ఎకరాల్లో పంట సాగవుతుండగా ప్రస్తుతం నీరందకపోవడంతో వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పంటలు నెర్రెలు ఇవ్వడంతో రైతులు ఆందోళన

(మిగతా 6వ పేజీలో)

సాగర్ గండ్లను సత్వరమే పూడ్చాలి

ఉత్తమ్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ఖమ్మం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాగర్ ఎడమకాలువ కింద ఇటీవల పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని, రెండురోజుల్లో కాలువ మరమ్మతులు పూర్తిచేసి సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో విజ్ఞప్తి చేశారు. కాలువ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయని, అధికార యంత్రాంగం తీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం లేకుండా, పంటలు ఎండిపోకుండా రెండురోజుల్లోగా మరమ్మతులు పూర్తిచేయాలన్నారు. నీటివృథాను అరికట్టేందుకు ఎక్కడా గండ్లు లేకుండా చూడాలని కాలువ కట్టలను పటిష్టం చేయాలని సూచించారు. చివరి ఆయకట్టుకు నీరందించేలా ప్రతి అధికారి సమన్వయంగా పనిచేసేలా చూడాలని మంత్రి తుమ్మల సూచించారు.

విపక్షాల నిరసన

- సాగు నీరందించి వరిపైరును కాపాడాలని డిమాండ్
- కల్లూరు, వైరాలో సీపీఎం, సీపీఐ, టీడీపీ ఆందోళనలు
- పొద్దుటూరులో పైర్లను పరిశీలించిన నాయకులు 6

ఆశలకు రెక్కలు

మళ్లీ తెరపైకి కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్

- కేంద్ర విమానయానశాఖ మంత్రికి తుమ్మల వినతి
- గతంలో రెండుసార్లు సర్వే దశలో నిలిచిన ప్రతిపాదనలు
- విమానాశ్రయం వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మరింత ఊతం



కొత్తగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం విమానాశ్రయ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడిని కలిసి కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. వాస్తవానికి గతంలోనే రేణుకాచౌదరి కేంద్ర పర్యాటక శాఖమంత్రిగా పనిచేసిన సమయంలో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించి సర్వేలు కూడా చేయించారు. కానీ ఆ ప్రతిపాదన అప్పట్లో ఆగిపోయింది. తరువాత మళ్లీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ తరపున ఏకైక ఎమ్మెల్యేగా గెలిచిన జలగం వెంకట్రావు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నెలకొల్పాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పుడు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖమంత్రిగా పని చేసిన తుమ్మల నాగేశ్వరరావు సైతం కేంద్ర ప్రభుత్వానికి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుపై విజ్ఞప్తి చేశారు. దాంతో భూమికోసం లక్ష్మీదేవిపల్లి మండలంలో సర్వే నిర్వహించి మైలారం, బంగారుచెలక ప్రాంతాల్లోని పునుకుడుచెలక గ్రామంలో సుమారు 1,000 ఎకరాల భూమిని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. దీంతో ఎయిర్‌పోర్టు అథారిటీ కమిషన్‌ను కూడా ఈ ప్రాంతానికి పంపి సర్వే చేయించి నివేదికలు తీసుకున్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం కూడా ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే తమ భూములు ఎయిర్‌పోర్టు కింద పోతాయనే భయంతో ఆ ప్రాంతానికి చెందిన గిరిజన రైతులు ఎయిర్‌పోర్టు నిర్మించవద్దని వ్యతిరేక గళాన్ని వినిపించారు. ఆ తర్వాత వచ్చిన ప్రజాప్రతినిధులు ఎవరూ ఎయిర్‌పోర్టు అంశాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఎయిర్‌పోర్టు వస్తే మరింత అభివృద్ధి..

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే ఉమ్మడి జిల్లా మరింత అభివృద్ధి సాధించేందుకు వీలుంటుంది. వాస్తవంగా జిల్లాలో అన్నిరకాల వనరులు అపారంగా ఉన్నాయి. పరిశ్రమలు, ఖనిజ సంపద, సింగరేణి బొగ్గు, బీహెచ్‌ఈఎల్, ఎయిర్‌వాటర్ ప్రాజెక్టు, నవభారత్, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు సంబంధించిన ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులు, అనధికారులు ప్రయాణాలు సాగించడానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి అశ్వాపురంలో హెవీవాటర్ ప్రాజెక్టు, భద్రాచలం ఐటీసీ బీపీఎల్ కర్మాగారం, కొత్తగూడెంలో సింగరేణి ప్రధాన కార్యాలయానికి సంబంధించిన ఉన్నతాధికారులు ఢిల్లీ, ముంబాయి, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించే అవకాశం ఉన్నందున ఎయిర్‌పోర్టుకు ఆదాయం అధికంగానే ఉండే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే జిల్లాకు కొత్త పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉంది.

అనువైన స్థలాలు ఎన్నో..

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో అనువైన ప్రభుత్వ స్థలాలు చాలా ఉన్నాయి. వాటిలో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఒక వేళ బంగారుచెలక, మైలారం ప్రాంతంలో గతంలో చూసిన ప్రభుత్వ భూమిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టినా ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. ఆ ప్రాంతంలో చదువుతున్న గిరిజన యువతకు కూడా ఉపాధి అవకాశాలు దక్కుతాయి. తద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

వరద బాధితులు 9300 మంది..

- నేడు ప్రభుత్వ పరిహారం జాబితా బహిరంగ ప్రదర్శన
- మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులు 2,600
- అనర్హులను అడ్డుకునేందుకు కమిషనర్ చర్యలు



ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 19: మున్నేరు పరివాహక ప్రాంతంలో సెప్టెంబరు 1న వ్యాపించిన వరద ముంపుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ, కేఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు ఐదురోజుల పాటు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఇంటింటి సర్వే చేసి బాధితుల లెక్కలను తేల్చారు. వాటిలో బ్యాంకుల ఆన్‌లైన్ పలు కారణాలతో 800మంది బాధితులకు పరిహారం అందలేదు. వాటి పంపిణీపై ఆయా బ్యాంకులతో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు పరిహారం చెల్లించాలంటూ మూడు రోజులుగా ఖమ్మం నగర పాలక సంస్థకు వచ్చే దరఖాస్తుల తాకిడి పెరిగింది. మూడు రోజుల్లోనే 2,600మంది నూతనంగా ముంపు సర్వే కోసం దరఖాస్తులు చేశారు. నాలుగు కౌంటర్ల ద్వారా కేఎంసీలో సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. వాటిని శుక్రవారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టనున్నారు. కాగా శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉండదని కేఎంసీ అధికారులు ప్రకటించారు.

నేటి నుంచి బాధితుల జాబితా ప్రదర్శన

మున్నేరు వరద ముంపు బాధితుల్లో ఇప్పటివరకు 9,300మంది బాధితుల బ్యాంకు ఖాతాలకు రూ.14కోట్ల వరకు ప్రభుత్వం పరిహారం డబ్బులను జమ చేసింది. ముంపు ప్రాంతాల్లోని నివాసాల సంఖ్యకు సరిపోయింది. గత మూడు రోజుల నుంచి సర్వే కోసం మరో 2,600 దరఖాస్తులు రావటంతో వాటిని పరిశీలించిన అధికారులు గతంలో పరిహారం పొందిన కుటుంబ సభ్యులే తిరిగి దరఖాస్తులు చేస్తున్నారని తెలిసింది. దీంతో పరిహారం పొందిన బాధితుల జాబితాలను బహిరంగ ప్రదర్శనకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. గతంలో ధ్రువపత్రాల మంజూరు కోసం ప్రత్యేక క్యాంపులు పెట్టిన 8 కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో బహిరంగంగా ముంపు పరిహారం పొందిన బాధితుల జాబితాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ముంపునకు గురైన 14 డివిజన్ల బాధితులు తమ పేర్లు బహిరంగ జాబితాల్లో చూసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధితులకు సూచించారు.

నిమజ్జన కష్టాలు

- భద్రాచలంలో ఏటా 5 వేల విగ్రహాల నిమజ్జనం
- ప్రతీ ఏడాది పెరుగుతున్న విగ్రహాల రాక
- గోదావరి వద్ద రద్దీకి తగినట్టు కానరాని ఏర్పాట్లు
- బల్లచెక్క వాడితే బెటర్ అంటున్న సిబ్బంది

భద్రాచలం, సెప్టెంబరు 19: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి తీసుకురావడం ప్రతి ఏటా జరుగుతుంది. అయితే నిమజ్జన సమయంలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. గత నాలుగు రోజుల నుంచి గణేష్ విగ్రహాల నిమజ్జనం చేస్తుండగా ఇప్పటివరకు కేవలం 1500విగ్రహాలే నిమజ్జనం కావడం గమనార్హం. ప్రతీ ఏటా నాలుగు నుంచి ఐదువేల విగ్రహాలను భద్రాద్రిలో నిమజ్జనం చేస్తుండగా, ఈ ఏడాది ఇప్పటివరకు 1500మాత్రమే నిమజ్జనం చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గణేష్ నిర్వాహక కమిటీలు పోటీలు పడి గణేష్ విగ్రహాలను 12 నుంచి 15అడుగుల ఎత్తులో పది నుంచి 12 అడుగుల వెడల్పుతో తెస్తుండటంతో వాటిని నిమజ్జనం చేసే సమయంలో గజ ఈతగాళ్లకు, విగ్రహాలు వేసే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు లాంచీలు అందుబాటులో ఉన్నా పెద్ద విగ్రహం ఒక్కసారే తీసుకెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం సైతం అధికమవుతోంది. మరోవైపు గోదావరి నీటిమట్టం ఈ సారి ఆరంభంలో ఆశించినస్థాయిలో ఉండగా అనంతరం క్రమేపి 19అడుగులకు తగ్గడంతో లాంచీలపై విగ్రహాలను ఎక్కించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో గోదావరి తగ్గడం, పెరగడం జరుగుతూ ఉంటుంది. ఈ సమయంలో శాశ్వత ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఆ పరిసరాల్లో బురద పేరుకుపోయి నిమజ్జన కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది.

కాగా ఈసారి మూడు లాంచీలున్నప్పటికీ రాత్రి సమయంలో కొన్ని లాంచీలు నడపలేని పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో గణేష్ నిమజ్జనాలు వేగంగా సాగేందుకు పంట్ (బల్లచెక్క) వాడకం ఎంతో ఉపయోగపడుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆరు అడుగుల విగ్రహాలు 20ఒకేసారి తీసుకెళ్లేందుకు వీలుంటుందని, అలాగే పెద్ద విగ్రహాలు నాలుగు వరకు తీసుకెళ్లవచ్చని వారు పేర్కొంటున్నారు. కాగా శాఖల మధ్య సమన్వయ లోపం ఈసారి స్పష్టంగా కనపడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాదికి ఎటువంటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని భక్తులు, సిబ్బంది కోరుతున్నారు. ఇదిలావుండగా, గణేష్ విగ్రహాలను తొమ్మిదో రోజు లేదా 11వ రోజుకే తీసుకొచ్చేలా అధికారులు నిర్వాహక కమిటీలకు ఆదేశాలు జారీ చేయాలనే ప్రతిపాదన సైతం ఈసారి తెరపైకి వచ్చింది.



నిమజ్జనం చేయాల్సిన విగ్రహాలు



భద్రాద్రి రామయ్య సన్నిధిలో ప్రారంభమైన పాదయాత్ర

భద్రాద్రి టూ తిరుపతి

ఏడోసారి మహాపాదయాత్ర ప్రారంభం

భద్రాచలం, సెప్టెంబరు 19: భద్రాద్రి రామయ్య సన్నిధి నుంచి తిరుపతి వెంకన్న వద్దకు కొత్తగూడెం త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థలకు చెందిన సభ్యులు ఏడోసారి నిర్వహిస్తున్న మహాపాదయాత్ర గురువారం భద్రాద్రి రామయ్య పాదాల చెంత ప్రారంభమైంది. ఈ యాత్రను భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఉపప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు ప్రారంభించారు. 619 కి.మీ. ఈ పాదయాత్ర సాగనుంది. త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో 2004 నుంచి ప్రతి లీప్ సంవత్సరంలో భద్రాచలంలోని రామయ్య సన్నిధి నుంచి తిరుమల శ్రీవారి సన్నిధి వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ఈ విధంగా ఇప్పటి వరకు ఆరుసార్లు పాదయాత్ర పూర్తి చేయగా తాజాగా ఏడోసారి పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సేవా కార్యక్రమంలో నిత్యాన్నదాన ట్రస్టుకు తమ సంస్థల తరపున రూ.10 లక్షల విరాళం ఇవ్వనున్నట్టు తెలిపారు.

అర్హుల జాబితా కేజీబీవీ నోటీస్‌బోర్డులో...

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 19: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి గతేడాది జూలై 2023న నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితా కేజీబీవీ కార్యాలయం నూతన కలెక్టరేట్ భవనంలోని కేజీబీవీ నోటీస్ బోర్డులో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఈ నెల 21న నగరంలోని పాత డీఈవో కార్యాలయం, ఖమ్మం నందు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

చుంచుపల్లి, సెప్టెంబరు 19: ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి గురువారం తెలిపారు. వివిధ కేసుల్లో పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు హాల్లో బీమా కంపెనీల న్యాయవాదులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. బీమా కంపెనీల ప్రతినిధులు వీలైనంత త్వరితగతిన వారి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, బీమా కంపెనీల న్యాయ వాదులు రామారావు, రామచంద్రారెడ్డి, రాంప్రసాదరావు, మాధవరావు, విజయ్‌కుమార్, రాజమల్లు, నాగేశ్వరరావు, చిరంజీవిరావు, దేవదాస్, శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించాలి

న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు

భద్రాచలం, సెప్టెంబరు 19: ఈనెల 28న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులు ఎక్కువసంఖ్యలో పరిష్కరించేందుకు న్యాయవాదులు ముందుకు రావాలని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి వీలున్న కేసులైన చెక్‌లు, భార్యాభర్తల గొడవలు, బ్యాంకు కేసులు, శ్రీరామ్ చిట్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కేసులను పరిష్కరించి సమయాన్ని ఆదా చేసుకోవాలని కోరారు. కోర్టు చుట్టూ తిరగకుండా అవగాహన కల్పించాలని కోరారు.

36 అడుగులతో అలుగు పునరుద్ధరణ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో కమిషనర్ చర్యలు ప్రారంభం
- ఊపిరి పోసుకుంటున్న ఎన్‌పోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఖానాపురం ఊరచెర్వు నుంచి మున్నేరు వరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- ఇప్పటికే 13 కట్టడాలు, భవనాలకు నోటీసులు



10వ డివిజన్ ప్రాంతంలో వెడల్పు చేసిన అలుగు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 19: ఖమ్మంలో మరోసారి వరదలు వస్తే నష్టం వాటిల్లకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలను షురూ చేసింది. ముఖ్యంగా నగరంలో అక్రమ నిర్మాణాలపై చర్యలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉపక్రమించారు. గత ప్రభుత్వంలో అమలుకు నోచుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్‌లను తిరిగి రంగంలోకి దింపుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో కేఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల జిల్లా అధికారుల సమావేశం జరిపి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

ఊరచెర్వు నుంచి మున్నేరు వరకు అలుగు పునరుద్ధరణ

రఘునాథపాలెం మండలంలో కురిసిన వర్షపు నీటితో పాటుగా 1, 2, 3వ డివిజన్ల వర్షపు నీరు ఖానాపురం ఊరచెర్వుకు చేరుతోంది. అక్కడ నుంచి లకారం చెర్వుకు, ధంసలాపురం చెర్వుకు అలుగు ద్వారా మున్నేరులోకి వరద నీరు చేరుతోంది. కాకతీయుల కాలంలో ఒకదానితో మరొకటి అనుసంధానం చేసి ప్రజల నివాసాల మీదకు వరద నీరు చేరకుండా నిర్మాణాలు జరిగాయి. అయితే పట్టణాలు అభివృద్ధి, చెరువుల సుందరీకరణతో అలుగులు మూతపడ్డాయి. కాల్వలపై అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఖానాపురం నుంచి ధంసలాపురం వరకు ప్రాంతాలు నీట మునిగాయి.

ఈ క్రమంలోనే మరోసారి భారీ వర్షాలు, వరదలు వస్తే ప్రజల నివాసాలు ముంపునకు గురి కాకుండా ఖానాపురం చెరువు నుంచి మున్నేరు వరకు అలుగును వెడల్పు చేసే కార్యక్రమం ప్రారంభం కానుంది. ఖానాపురం చెరువు అలుగును ప్రాథమికంగా కనీసం 36 (12మీటర్లు దాదాపు) అడుగులు వెడల్పుకు కార్యాచరణ చేశారు. ఇందులో అలుగు లోపలి భాగం 8మీటర్లు, రెండు పక్కల అలుగు సరిహద్దు రెండు మీటర్ల చొప్పున మొత్తం 12 మీటర్లు వెడల్పుతో ఖానాపురం చెరువు నుంచి లకారం చెరువు వరకు అక్కడ నుంచి ధంసలాపురం, మున్నేరులోకి అలుగు పునరుద్ధరణకు కార్యాచరణ ప్రారంభించారు. అలుగు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరిగిన 13 కట్టడాలు, భవనాలకు నోటీసులు జారీ చేశారు. వీటిలో ఒక ఐస్ ఫ్యాక్టరీని ఇప్పటికే కేఎంసీ అధికారులు కూల్చి వేశారు.

ఊపిరి పోసుకుంటున్న కమిటీలు

అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల సంరక్షణలో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ కమిటీలు కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యవేక్షణలో ఎన్‌ఫోర్స్‌మెంట్, కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు తిరిగి ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేఎంసీతో పాటుగా రెవెన్యూ, ఇరిగేషన్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.

రుణమాఫీకి పెరుగుతున్న అర్హులు

- ఇంటింటి సర్వేతో భారీగా దరఖాస్తులు
- అర్హత ఉండి రేషన్‌కార్డు లేనివారెందరో..

మధిర, సెప్టెంబరు 19: రైతులను రుణవిముక్తులను చేయాలనే ప్రభుత్వ లక్ష్యం ఇంకా నెరవేరనేలేదు. రూ.2లక్షల లోపు రుణమాఫీ అర్హులు ఇంకా పెరుగుతూనే ఉన్నారు. తెల్లరేషన్ కార్డులేక రుణమాఫీకి అర్హత ఉన్నా వర్తించని వారు చాలా మంది ఉండటంతో ప్రజలనుంచి ప్రభుత్వానికి నిరసన వ్యక్తమైంది. దీంతో రేషన్‌కార్డు లేకున్నా అర్హత ఉన్నవారిని గుర్తించాలని ప్రభుత్వం వ్యవసాయాధికారులను ఆదేశించడంతో వ్యవసాయాధికారులు గ్రామాల బాటపట్టి ఇంటింటి వారీగా కుటుంబ వివరాలు సేకరిస్తూ అర్హులను నిర్ధారిస్తున్నారు. దీంతో రైతులనుంచి వస్తున్న విజ్ఞాపనలు రోజురోజుకు వేలల్లో పెరుగుతున్నాయి.

భారీగా వస్తున్న ధరఖాస్తులు

రుణమాఫీ కోసం రైతులనుంచి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు గుర్తించిన అర్హులు జిల్లా వ్యాప్తంగా 55,838మంది ఉన్నట్లు సమాచారం. మధిర డివిజన్‌లోనే 15,250మంది రూ.2లక్షల లోపు రుణమాఫీకి అర్హులు ఉన్నట్లు గుర్తించారు. సర్వే కొనసాగుతుండటంతో ఈ సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉందని అధికారులు తెలుపుతున్నారు. ప్రతి గ్రామంలోని రైతు వేదికల్లో రైతులను పిలిచి కుటుంబాల వారీగా వెరిఫైచేసి అర్హులను యాప్‌లో ఫీడ్ చేస్తున్నారు. తమకు అర్హత ఉన్నా రేషన్ కార్డు లేదనే సాకుతో రుణమాఫీ వర్తించలేదని ప్రభుత్వం గత పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వనప్పుడు తాము రేషన్ కార్డు ఎక్కడినుంచి తీసుకొస్తామని రైతులు అధికారుల వద్ద వాపోతున్నారు. కాగా, మధిర మండలంలో 4,511 మంది రైతులు,



కుటుంబ సభ్యులను యాప్‌లో ఫీడ్ చేస్తున్న మండల వ్యవసాయాధికారి

ఎర్రుపాలెం మండలంలో 3,378మంది రైతులు, బోనకల్ మండలంలో 2,857 మంది రైతులు, ముదిగొండ మండలంలో 2,479మంది రైతులు, చింతకాని మండలంలో 2,025మంది రైతులను అర్హులుగా అధికారులు గుర్తించారు.

ప్రతి దరఖాస్తును పరిశీలిస్తున్నాం

విజయచంద్ర, ఏడీఏ

రూ.2లక్షల లోపు రుణమాఫీకి అర్హత ఉండి రేషన్ కార్డులేక రుణమాఫీ పొందలేని వారి జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం పేర్కొన్న నిబంధనల ప్రకారం ప్రతి రైతు కుటుంబాన్ని స్వయంగా తమ అధికారులు పరిశీలించి అర్హులను గుర్తించడం జరుగుతుంది. రైతులనుంచి వస్తున్న విజ్ఞాపనలను అన్నిటినీ స్వీకరిస్తున్నాం. అర్హుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నాం. రైతులందరికీ న్యాయం చేసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. త్వరలోనే సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి అందించడం జరుగుతుంది.



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఐబీ అధికారులు

వెదుళ్ల చెరువు సర్వే ప్రారంభం

తల్లాడ, సెప్టెంబరు 19: మండల కేంద్రమైన తల్లాడలోని వెదుళ్ల చెరువు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టారు. వెదుళ్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలు జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించారు. సర్వేనెంబర్ 757లో వెదుళ్ల చెరువు లోతట్టు విస్తీర్ణం 113ఎకరాల 17కుంటల విస్తీర్ణం ఉంది. లోతట్టు శిఖాన్ని ఆక్రమించుకొని భవనాలు నిర్మించారని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఐబీశాఖ అధికారులు సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెదుళ్ల చెరువు నిండా నీళ్ల ఉండటంతో రెండు భాగాల్లో సర్వే చేసే పరిస్థితి లేకపోవడంతో చెరువులో నీళ్ల తగ్గిన తర్వాత సమగ్ర సర్వే చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఐబీ డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈ పి.శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ భరత్, ఎంఆర్‌ఐ భాస్కర్, ఏఎస్‌వో మధు పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్ల బదిలీలు

చుంచుపల్లి, సెప్టెంబరు 19: జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ జితేష్ వీ పాటిల్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు.

తహసీల్దార్	ప్రస్తుతం	బదిలీ
పానెం కృష్ణ	చుంచుపల్లి	దమ్మపేట
బీ స్వర్ణ	అశ్వాపురం	చుంచుపల్లి
నాగ భవానీ	టేకులపల్లి	అశ్వాపురం
సీహెచ్ నరేష్	దమ్మపేట	పినపాక
ముజాహిద్	బూర్గంపాడు	టేకులపల్లి
తోట శ్రీనివాసరావు,	పినపాకలో	గుండాల,
మేక ఇమ్మానియేల్	గుండాల	బూర్గంపాడు

3నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 19: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబరు 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావులు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబరు 16 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హాల్ టికెట్లు సంబంధిత ఓపెన్ స్కూల్స్‌లో కాని ఆన్‌లైన్‌లో కాని తీసుకుని పరీక్ష సమయానికి గంట ముందుగా చేరుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, మరేదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008403522 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

గోదావరి పుష్కరాలే లక్ష్యంగా

భద్రాద్రిలో అభివృద్ధి పనులు

● మూడేళ్ల ముందే కసరత్తు ప్రారంభించిన ప్రభుత్వం



2015లో గోదావరి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భద్రాచలం, సెప్టెంబరు 19: 2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా భద్రాచలంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావుతో పాటు ఇతర అధికారులు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తితో దేవాదాయశాఖ మంత్రి సురేఖ సమావేశమయ్యారు. గోదావరి పుష్కరాలకు లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ముందస్తుగానే అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. 2015లో నిర్వహించిన గోదావరి పుష్కరాలకు 60లక్షలమంది భక్తులు వచ్చారు. ఈసారి ఆ సంఖ్య కోటి దాటే అవకాశం ఉందని అంచనా. ఈ క్రమంలో అందుకు అనుగుణంగా పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

భూసేకరణ పనులపై నజర్

భద్రాచలంలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. అందులో భాగంగా భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ అమలు కోసం రూ.60.28కోట్లు నిధులు విడుదల చేస్తూ జీవోను జారీ చేసింది. అయితే అధికారులు 43 ఇళ్లను తొలగించేందుకు ప్రాథమికంగా నిర్ణయించగా మరోసారి తుది సర్వే నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఆలయ రహదారిని ఆనుకొని ఉన్న రోడ్డు విస్తరణలో భాగంగా పక్కనే ఉన్న కుసుమ హరినాథబాబా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం ఒరగడంతో అధికారులు దానిని తొలగించారు. కాగా హరినాథ బాబా ఆలయం దెబ్బతినే పరిస్థితులుండటంతో చుట్టూ రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

రాముడు నడయాడిన ప్రాంతాలను భక్తులకు వివరిస్తూ డిజిటల్ మ్యూజియం ఏర్పాటు చేసే ఆలోచనలో అధికార యంత్రాంగం ఉన్నట్లు వినికిడి. ఈ ప్రతిపాదనకు మంత్రి సైతం సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆలయ పరిసరాల్లో ఆకర్షణీయమైన విద్యుత్తు దీపాలు, ఫౌంటేన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

భద్రాద్రి దేవస్థానానికి చెందిన దేవాలయ భూముల్లో పూలు, తులసి వనాలు పెంచాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఇందుకోసం ఉద్యానవనశాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే భద్రాద్రి దేవస్థానం భద్రాద్రికి కూతవేటు దూరంలో ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా పురుషోత్తపట్నం శ్రీగోకుల రామం నిర్మాణం చేపడుతోంది. ఇందులో పూలు, తులసివనాలు పెంచాలని గతంలోనే అధికారులు నిర్ణయించారు. ఎందుకంటే ఏటా లక్షలాది రూపాయలు పూలు, తులసిలకు దేవస్థానం చెల్లించాల్సి వస్తోంది. పూలు, తులసివనం రూపుదిద్దుకుంటే దేవస్థానానికి భారీగా ఖర్చు తగ్గే అవకాశాలున్నాయి.

రైతుల కంట కడ‘గండ్లు’

(5వ పేజీ తరువాయి)

చెందుతున్నారు. ఇప్పటికే గండి పడి 20రోజులు అవుతోందని, నేటికీ పనులు పూర్తిచేయలేకపోయారంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా, సాగర్ ఎడమకాల్వ మరమ్మతులు శనివారం రాత్రి కల్లా పూర్తిచేసి ఆదివారం నాటికి నీటిని విడుదల చేస్తామని ఐబీ డీఈ మధు తెలిపారు. అండర్ టన్నెల్ గోడకూలడం, స్థానికంగా మట్టి లభ్యత లేకపోవడం, క్షేత్రస్థాయిలో అడ్డంకుల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని తెలిపారు.

సాగునీరు లేక ఎండిపోతున్న వరి

సాగర్ కాల్వపై ఎగువన పడిన గండ్లు కల్లూరు డివిజన్ రైతులకు శాపంగా మారాయి. గతేడాది తీవ్ర వర్షాభావ ప్రభావంతో రెండు పంటలను కోల్పోయిన రైతులు... సాగు నీటి ఎద్దడి ఫలితంగా ఈ ఏడాది కూడా వరి పంటను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కల్లూరు జలవనరులశాఖ డివిజన్ పరిధిలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాలతో కలిపి సుమారు 76వేల ఎకరాల్లో వరి పైరు సాగవుతోంది. ఇక మధిర బ్రాంచి కాల్వ పరిధిలో 30వేల ఎకరాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. ఈ ఏడాది వర్షకాలం ఆశాజనకంగా ఉందని సాగర్ ఆయకట్టు కింద జూన్ నెల 15తర్వాత కరివేద సాగులో విస్తారంగా వరి పైరు చేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. ఈ దశలో సాగర్ కాల్వకు గండ్ల మూలంగా నీరు అందకపోతుండటంతో వరి ఎండిపోయే దశకు చేరుకుంది. ఇప్పటికే రైతులు సగటున ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వరి కంకి పాలు పోసుకునే దశలో సాగునీటి తడులు అందించాల్సి ఉంది. ఈ తరుణంలో సాగర్ కాల్వ పై ఎగువన పడిన గండ్ల ప్రభావంతో గత 20రోజుల నుంచి సాగునీరు అందక పొలాలు ఎండిపోయి బీటలు వారి నెర్రెలు ఇస్తున్నాయి. తక్షణమే సాగునీరు అందించకపోతే ఎండతీవ్రతకు వేలాది ఎకరాల వరి అగ్గిపాలయ్యే పరిస్థితి దాపురించనున్నది.

వడివడిగా గండ్ల పూడ్చివేత పనులు

● లక్ష్మీనారాయణ, ఈఈ, కల్లూరు డివిజన్

సాగర్ ప్రధాన కాల్వపై తుఫాన్ వరదలతో పడిన గండ్లను జిల్లా జలవనరులశాఖ అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పూడ్చివేత చర్యలు చేపట్టింది. వాటిని పూడ్చివేయగానే ఆదివారం నుంచి సాగర్ జలాలు విడుదల చేసే అవకాశం ఉంది. సాగునీటి ఎద్దడితో ఈ ప్రాంతంలో పొట్ట దశలో ఉన్న వరి పైరు ఎండిపోతున్న విషయాన్ని పై అధికారులకు తెలియపరిచాం. సాగునీరు అందించాలని రైతులు కూడా ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ప్రధాన కాల్వపై భారీగా గండ్లు పడటంతో వాటి పూడ్చివేతకు సమయం పడుతోంది.



చంద్రుపట్లలో ఎండిపోతున్న వరి పైరు

తక్షణమే సాగునీరు అందించాలి...

● కాటంనేని రామారావు, రైతు, చంద్రుపట్ల

గతేడాది వర్షాభావంతో రెండు పంటలు కోల్పోయాం. ఈ ఏడాది సాగర్‌లో నీరు ఉన్నప్పటికీ, కాలువకు గండ్లు పడటం మాకు శాపంగా మారింది. ఇప్పటికైనా గండ్ల పూడివేతను వేగవంతంగా పూర్తి చేసి సాగు నీరు విడుదల చేయాలి. ఎకరానికి రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడులు పెట్టాం. పంట దిగుబడి రావాల్సిన సమయంలో సాగునీరు లేకపోవడం సమస్యగా మారింది. పొట్ట దశకు వచ్చిన వరి పైరు సాగునీరు లేక ఎండిపోయే పరిస్థితికి రావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా అధికార యంత్రాగం కాల్వపై గండ్లు పూడ్చివేతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

జూలూరుపాడు, సెప్టెంబరు 19: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన ధారావత్ రవి (53) అనే వ్యక్తి అదృశ్యం కావడంతో గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రవి బుధవారం ఉదయం 7:30 గంటల సమయంలో బయటకి వెళ్లి టిఫిన్ చేసి వస్తానని భార్య పద్మతో చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికినప్పటికి దొరకలేదు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాణాప్రతాప్ తెలిపారు.

21ఫిట్ ఏరియాలో స్థల వివాదం

ఇల్లెందురూరల్, సెప్టెంబరు19: మండలంలోని 21ఫిట్ ఏరియా పరిధిలో గురువారం ఇరువర్గాల నడుమ జరిగిన స్థల వివాదం ఘర్షణకు దారి తీసింది. మా సొంత స్థలంలో అక్రమంగా దర్గా నిర్వహిస్తున్నారని, గార్ల మండలానికి చెందిన కొంత మంది వ్యక్తులు అక్కడ ఉన్న దర్గాను కుల్చివేశారు. గత 70 ఏళ్లుగా రబ్బాని మౌలాసాబ్ అనే వ్యక్తి దర్గా నిర్వహిస్తున్నడని, దర్గా ఉన్న స్థలం ఫారెస్టు అధీనంలో ఉందని, పట్టాభూమి కాదని 21ఫిట్‌కు చెందిన స్థానికులు కుల్చివేయడానికి వచ్చిన వ్యక్తులను అడ్డుకోబోయారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలను పోలీసులు సముదాయించారు. ఈ విషయంపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

విపక్షాల నిరసన

- సాగునీరందించి వరిపైరును కాపాడాలని డిమాండ్
- కల్లూరు, వైరాలో సీపీఎం, సీపీఐ, టీడీపీ ఆందోళనలు
- పొద్దుటూరులో ఎండిన పొలాలను పరిశీలించిన నాయకులు



వైరాలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

కల్లూరు/వైరా/చింతకాని, సెప్టెంబరు 19: సాగర్ ఎడమకాల్వకు పడిన గండ్లను వెంటనే పూడ్చివేసి సాగునీరు విడుదల చేయాలని విపక్షాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇరిగేషన్ కార్యాలయాల ముందు ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. కల్లూరులో గురువారం జలవనరుల శాఖ ఈఈ, ఆర్డీవో కార్యాలయాల ముందు టీడీపీ, సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు తాత భాస్కరరావు, టీడీపీ జిల్లా నాయకులు కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనివాసరావులు మాట్లాడుతూ సాగర్ కాల్వ ఎగువన గండ్లు పడటంతో 20 రోజుల నుంచి సాగునీరు అందక పొట్ట దశలో ఉన్న వరి పైరు ఎండి పోయే దశకు చేరుకుందన్నారు. గండ్లు పూడ్చివేతలో ప్రభుత్వం అలసత్వంతో వరిపైరుకు కాల్వల ద్వారా నీరు అందని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం ఈఈ లక్ష్మీనారాయణ, డీఏవో రమేష్‌లకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, రైతులు పోటు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, రావి సూర్యనారాయణ, మండేపూడి బసవయ్య, బీరవల్లి పుల్లయ్య, గోసు కృష్ణ, రమణ, తదితరులు పాల్గొన్నారు. కాగా, సాగునీటి కోసం రైతుల ధర్నా చేయనున్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం 7 గంటలకల్లా రైతు సంఘం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. వారిలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ముదిగొండ్ల అంజయ్యలను అదుపులోకి తీసుకోని మధ్యాహ్నం వారిని విడుదల చేశారు.

పంటలను కాపాడండి...

సాగర్ నుంచి సాగునీరు విడుదల చేసి లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం వైరాలో రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కల్లూరు ఇరిగేషన్ ఆఫీసు వద్ద ఆందోళనకు పిలుపునివ్వడంతో సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసి గృహనిర్బంధం చేయడంతో రైతుసంఘ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ప్రభుత్వ చర్యలను ఖండించారు. నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ వైఫల్యం..

సాగర్ నీటిని విడుదల చేసి ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఐ రైతుసంఘం నాయకుడు బాగం హేమంతరావు కోరారు. చింతకాని మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ఎండిపోతున్న పంటలను గురువారం వారు పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన గండ్లు పూడ్చి సాగునీటిని అందిస్తామని ప్రకటించి రెండు వారాలు గడిచినా నీటిని విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే నీటిని విడుదల చేసి పంట నష్టం తీవ్రత తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోటు ప్రసాద్, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, తోట రామాంజనేయులు నాయకులు పాల్గొన్నారు.



చింతకానిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తెలంగాణ రాష్ట్ర హాకీ జట్టు కోచ్, మేనేజర్లుగా భద్రాద్రి క్రీడాకారులు

చుంచుపల్లి, సెప్టెంబరు19: హాకీ ఇండియా సబ్ జూనియర్ బాలుర జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఆపాక నిఖిల్ కోచ్‌గా, సర్వేష్ మేనేజరుగా వ్యవహరించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిఆర్.భీంసింగ్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన నిఖిల్ హాకీ క్రీడలో ఎన్ఐఎస్ పూర్తి చేసి , హాకీ ఇండియా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన లెవెల్ 2 కోచీగా అర్హత సాధించిన తొలి జిల్లా క్రీడాకారునిగా గుర్తింపు పొందాడు. సర్వేష్ సైతం సీనియర్ జాతీయ క్రీడాకారునిగా పేరు సాధించి హాకీ క్రీడలు ఎన్ఐఎస్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేశాడు. 14వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్ ఈ నెల 23 నుంచి అక్టోబరు 3 వరకు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడిలో జరగనున్నాయిని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి భట్టు ప్రేమ్ రాకుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడాధికారి పరందామ రెడ్డి , హాకీ అసోసియేషన్ ఛైర్మన్ పల్లపోతు శ్రీనివాస్, అధ్యక్షులు ఇమాది ఉదయ్‌కుమార్, జిల్లా కోచ్ ఇమాం, అసోసియేషన్ సభ్యులు సలీం ఖాన్, లగడపాటి రమేష్, రాజ్‌కుమార్, కృష్ణవేణి, మంజుల, కవిత, నాగరాజు, తదితరులు తమ హర్షం వ్యక్తం చేశారు.




మేనేజర్, కోచ్‌గా వ్యవహరించనున్న సర్వేష్, నిఖిల్

వరద బాధితులకు సింగరేణి ఉద్యోగుల సాయం

- రూ.10.25కోట్లు సీఎంకు అందజేత
- ఒకనెల జీతాన్ని సీఎంకు అందించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. యూనియన్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రూ.10.25కోట్ల చెక్కును సీఎం రేవంత్‌రెడ్డికి అందచేశారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, గుర్తింపు సంఘం వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసరెడ్డి సీతారామయ్య, కే. రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

అదే విధంగా వరద బాధితల సహాయార్థం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తన ఒక నెల జీతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ యూనియన్ నాయకులకు సింగరేణి యాజమాన్యానికి సీఎం, డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తల్లాడ: బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగింది. కొత్తమిట్టపల్లి గ్రామానికి చెందిన బిల్లా రాజేష్(34) ద్వి చక్ర వాహనంపై తల్లాడ నుంచి కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామమైన కొత్త మిట్టపల్లికి బైక్‌పై వెళ్తుండగా సత్తుపల్లి నుంచి తల్లాడ వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రేవతిదేవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ముగూడెం, సెప్టెంబరు 19: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన దుమ్ముగూడెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగువాయిబాడవకు చెందిన పర్శిక దీపక్ (15) ద్విచక్ర వాహనంపై లక్ష్మీనగరం నుంచి ఇంటికి వెళ్తుండగా ముందు వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో బస్సును ఢీకొట్టాడు. ప్రమాదానికి కారణమైన బస్సులో బాలుడి తల్లిదండ్రులున్నారు. కాగా తండ్రి గోపాలరావును డయాలసిస్ కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన తన కొ డుకును చూసిన తల్లి సావిత్రి వెంటనే ములకపాడు పీహెచ్‌సీకు తరలించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

3 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా..

ఇందిర డెయిరీ కార్యాచరణ చేపట్టాలి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 19: మూడు లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా ఇందిరా డెయిరీ కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ఇందిరాడెయిరీ పై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా డెయిరీ విజయవంతంగా నిర్వహణకు గాను పాల ఉత్పత్తి, పాల సేకరణ, మార్కెటింగ్ కి రవాణాకి పకడ్బందీ ప్రణాళిక చేయాలన్నారు. ఇదివరకే డెయిరీలకు పాల సరఫరా చేస్తున్న వారికి, గేదెల పెంపకంలో అవగాహన ఉన్నవారికి, షెడ్డు, పశుగ్రాసం లభ్యత ఉన్నవారికి మరో యూనిట్ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మధిర నియోజకవర్గ పరిధిలో 8 నుంచి 10 పాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కేంద్ర ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. పాల సేకరణ తర్వాత చిల్లింగ్ యూనిట్‌కు తరలింపునకు కార్యాచరణ చేయాలన్నారు. 4 నుంచి 5 వేల లీటర్ల పాల చిల్లింగ్ సామర్థ్యం గల చిల్లింగ్ యూనిట్‌కి భవనాన్ని గుర్తించినట్లు దీనిలో చిల్లింగ్ యూనిట్ కోసం రెన్నోవేషన్ పనులు చేపట్టాలన్నారు. వాహనాలు కోసం రోడ్ల నిర్మాణం చేయాలన్నారు.

రుణ సౌకర్యం కల్పించాలి

ఇందిరా డెయిరీలో సభ్యత్వం కలిగిన 40 వేల మంది సభ్యులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారిగా విభజన చేసి, ఆయా వర్గాల కార్పొరేషన్ల ద్వారా పాడి యూనిట్ల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించాలని అన్నారు. పాడి గేదెల యూనిట్ల ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాల చెక్ లిస్ట్ రూపొందించి, గ్రౌండింగ్‌కు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇదివరకే షెడ్డు, పశుగ్రాసానికి భూమి ఉన్నవారైతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధికారులు సమన్వయంతో కార్యాచరణ చేసి, డెయిరీ సక్సెస్‌కి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణు మనోహర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, విజయ డెయిరీ ఉప సంచాలకులు మురళీమోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఈడీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, సెప్టెంబరు 19: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగుకు చెందిన పందుల గోపి (45) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా రెండు నెలల క్రితం కరీంనగర్‌లో పని చేస్తుండగా పై అంతస్తు నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతను పనికి వెళ్లడానికి ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంటిపట్టునే ఉంటున్నాడు. దీంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోలేక మధ్యాహ్నం ఇంట్లోని తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత సేపటి తరువాత గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

రైలు కింద పడి యువకుడు...

మధిర, సెప్టెంబరు 19: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన మధిర-తొండలగోపవరం రైల్వే స్టేషన్ల మధ్య దెందుకూరు సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఏపీలోని గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన శెట్టి రఘువర్మ(22) కొంత కాలంగా మధిర మండలం రాయపట్నంలో తాపీమేస్త్రీగా పని చేస్తున్న తమ అమ్మమ్మ, తాతయ్య రామిశెట్టి కనకమ్మ, లక్ష్మీపతిల వద్ద ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. చదువులో రాణించలేక ఫెయిల్ కావడంతో మనస్తాపంతో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడుతున్న ట్లు మృతదేహం వద్ద లభించిన ఫోన్‌లో నోట్ చేసుకొని, దెందుకూరు సమీపంలోని కిలోమీటర్‌నెం. 533/2224 వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఈమేరకు రైల్వే ఎస్‌ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రీకృత పరిపాలన కోసమే జమిలి ఎన్నికలు

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 19: బీజేపీ ప్రభుత్వం భవిష్యత్‌లోను కేంద్రీకృత పరిపాలన కోసం జమిలి ఎన్నికల ప్రస్తావన తీసుకొస్తోందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్య రాష్ట్రాల స్ఫూర్తితో ఏర్పాటు జరిగిన భారత రాజ్యాంగంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వాలు స్వేచ్ఛను, హక్కుల్ని కాలరాసేందుకే మోదీ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలకు పూనుకుంటుందని విమర్శించారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వానికి విభేదాలు ఏర్పడి గవర్నర్లు అధికారం చేపట్టే దిశగా పరిపాలనలు సాగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీఎంలను జైలుకు పంపుతున్నారని, ఈడీ, సీబీఐ దాడులతో కేసుల్ని పెడుతున్నారని ఆరోపించారు. సెప్టెంబరు 24 నుంచి 30వ తేదీ వరకు కుల, మత ఉన్మాదులకు వ్యతిరేకంగా సత్యశోధక్ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదల కారణంగా గండిపడిన నాగార్జున సాగర్ కాల్వకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, రామయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ పాల్గొన్నారు.

ఎడమ కాల్వ గండ్లను పూడ్చండి : సండ్ర

సత్తుపల్లి, సెప్టెంబర్19: వరదలతో దెబ్బతిన్న నాగార్జున సాగర్ ఎడమ కాలువ గండ్లను త్వరితగతిన పూడ్చి రైతులకు నీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేయించి విద్యుత్ పునఃరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. గండ్లు పడటంతో ఇప్పటివరకు పంటలకు నీరు అందక ఎండిపోవడంతో పాటు నెలలు నెర్రలు బారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని లిఫ్ట్ ఇరిగేషన్ల ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడంతో రైతులకు నీరు అందక ఇబ్బంది పడుతున్నారని, ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేసి విద్యుత్ పునఃరుద్దరణ చేసి నీటిని అందించాలని రాష్ట్రానికి విజ్ఞప్తి చేశారు.

పాలేరు పాతకాల్వకు సాగర్ జలాలు

- పూర్తయిన మరమ్మతులు

కూసుమంచి, సెప్టెంబరు 19: పాలేరు పాతకాల్వకు అధికారులు గండి పూడ్చివేత పనులు పూర్తి చేశారు. దీంతో ఆయకట్టుకు సాగర్ జలాలు విడుదల చేశారు. ఎండుతున్న పంటలకు నీరు విడుదల చేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈనెల 1న భారీ వర్షాలకు పాతకాల్వకు గండిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేస్తూ తాత్కాలిక మరమ్మతులకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులను పూర్తిచేసి ఆయకట్టుకు నీరు అందించేలా కృషి చేశారు. రెండు వారాల్లో గండి పనులు పూర్తి చేసిన అధికారులు బుధవారం ఆయకట్టుకు నీరందించారు. ఐబీ ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, అనన్య, డీఈ బానాల రమేష్‌రెడ్డి తదితరులు అక్కడే ఉండి పనులు పూర్తి చేయించారు. గత నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో సాగులో ఉన్న వరిపంట ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందారు. సాగర్ జలాలు విడుదల చేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.



పాలేరు పాతకాల్వ గండి ప్రాంతం వద్ద నీటిప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మహిళల రిజర్వేషన్ కోటా లెక్క తేల్చాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

భద్రాచలం, సెప్టెంబరు 19: జమిలి ఎన్నికల పేరుతో మరో కొత్త నాటకానికి మోదీ తెరలేపారని, ముందు మహిళల 33 శాతం రిజర్వేషన్ కోటా లెక్క తేల్చాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. భ ద్రాచలంలో గురువారం ప్రారంభమైన ఐద్వా జిల్లా మూడో మహాసభల్లో ఆమె పా ల్గొని మాట్లాడారు. మోదీ మూడోసారి అధికారం చేపట్టాక రాజ్యాంగం అత్యంత ప్రమాదంలో పడిందని, నిత్యావసర ధరల పెరుగుదలతో మహిళలు, శిశువులకు పోషకాహారం అందకుండా పోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, వాణి, నాదెండ్ల లీలావతి, కృష్ణకుమారి, సున్నం గంగ, వస్తెల జ్యోతి, మచ్చ రమాదేవి, ఏజే గౌతమి, వై.పూర్ణిమ పాల్గొన్నా రు. అనంతరం పట్టణంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని పట్టణ ఎస్‌ఐ విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. మహిళల రక్షణ కోసం పోలీసు శాఖలో అనేక విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

జమిలిపై త్వరలో కమిటీ

- 47 పార్టీలకుగాను 32 మద్దతు తెలిపాయి
- జమిలితో ఆర్థిక భారం తగ్గుతుంది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/ హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల నిర్ణయం అమలు కోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. జమిలి విధానాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్న పార్టీలు కూడా కమిటీకి సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల.. ఓటర్లలో నిరాసక్తత పెరిగి ఓటింగ్ శాతం తగ్గడం స్పష్టంగా కనబడుతోందన్నారు. దీనికి జమిలి ఎన్నికలు పరిష్కారం చూపుతాయని భావిస్తున్నట్లు కిషన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల సుమారు రూ.4,500 కోట్లు ఖర్చు అవుతోందని, జమిలితో ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, దీనికి వేర్వేరుగా ఎన్నికలు జరగడం ప్రధాన అడ్డంకిగా ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. దేశవ్యాప్తంగా తరుచూ ఏదో ఒకచోట ఎన్నికలు, కోడ్ అమలు వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆటంకం కలుగుతోందన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి తలెత్తుతోందన్నారు. జమిలి అమలులోకి వచ్చాక ఆరు నెలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే మిగిలిన నాలుగున్నరేళ్లు దేశాభివృద్ధిపై దృష్టి సారించవచ్చన్నారు. 47 రాజకీయ పార్టీల్లో 32 పార్టీలు జమిలి ఎన్నికలకు సానుకూలంగా స్పందించాయన్నారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ నివేదిక ఆధారంగానే జమిలి ఎన్నికలకు ముందుకెళ్లాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అన్ని ఎన్నికలకు ఒకే ఓటర్ల జాబితా ఉండడం వల్ల ఓటర్ల హక్కులు కూడా కాపాడినట్లవుతుందన్నారు.

దానంపై చర్యలు తీసుకోండి

మహిళా కమిషన్‌కు మహిళా మోర్చా విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సినీ నటి, ఎంపీ కంగనా రనౌత్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి మండిపడ్డారు. ఆయనపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు బీజేపీ మహిళా మోర్చా నాయకులు ఫిర్యాదు చేశారు.

అన్నంలో రాళ్లొస్తుంటే ఏం చేస్తున్నారు?

ఏకలవ్య పాఠశాలల అధికారులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



సిరిసిల్ల జిల్లా దుమాలలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అన్నంలో ప్రతి రోజూ రాళ్ల వస్తున్నాయని విద్యార్థులు బాధపడుతున్నారు. మన పిల్లలకు రాళ్ల వస్తే తినిపిస్తామా? ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలలను సందర్శించారు. మరిమడ్ల పాఠశాలలో ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించారు. రూ.16 లక్షలతో టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొక్కలు నాటారు. ఆయా పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఆటలు ఆడించడం లేదని, టాయిలెట్లలో నల్లాల నుంచి నీళ్ల రావడం లేదని వారు తెలిపారు. తొలిసారి కాబట్టి వదిలేస్తున్నానని, ఇకపై ఇలా జరిగితే సహించేది లేదని అధికారులను సంజయ్ హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, సమస్యలుంటే చర్యలు తప్పవన్నారు. ఏం కావాలనుకుంటున్నారని విద్యార్థులను సంజయ్ అడగ్గా.. పలువురు కలెక్టర్, పోలీస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతామని, ఆర్మీలో చేరతామని చెప్పారు. ఒక విద్యార్థి మాత్రం తహసీల్దార్ కావాలని అనుకుంటున్నానని చెప్పగా.. ఎందుకని సంజయ్ అడిగారు. తమ ఊళ్లో భూములను దోచుకుంటున్నారని, తహసీల్దార్ అయితే వాటిని కాపాడవచ్చని ఆ విద్యార్థి చెప్పాడు. రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారా అని ప్రశ్నిస్తే ఎవరూ ఆసక్తి చూపకపోవడం విశేషం. ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించిన సందర్భంగా సంజయ్ కింద కూర్చుని.. విద్యార్థినులు పాడిన పాటలు విన్నారు. సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గిరిజన విద్యార్థులందరికీ కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. డబ్బుకు వెనుకాడకుండా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని, ఒక్కో విద్యార్థికి సగటున రూ.లక్షా 9 వేలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 1,26,626 మంది విద్యార్థులు ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. తెలంగాణలో 23 ఏకలవ్య పాఠశాలల్లో 8,309 మంది చదువుతున్నారని తెలిపారు.

'రింగు'కు కమిటీ.. ఇరువైపులా ఐటీ!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసే యోచనలో ఉంది. రహదారి అలైన్‌మెంట్‌తో పాటు రోడ్డు నిర్మాణం కోసం సేకరించబోయే భూముల గుర్తింపు, పరిహారం అందజేత సహా వివిధ అంశాలపై ఈ కమిటీ లోతుగా అధ్యయనం చేయనుంది. అనంతరం రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ అధిక భాగం ఈ మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై చాలా జాగ్రత్తగా వ్యవహరించనున్నారు.

ఎలా నిర్మించాలి?

వాస్తవానికి 2017లో రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్ మంజూరైనప్పుడు ఉత్తర, దక్షిణ భాగాలుగా కేంద్రం ఖరారు చేయగా.. ఇందులో తొలుత ఉత్తర భాగం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. కానీ, రోడ్డు మంజూరై 6-7 ఏళ్లు గడుస్తున్నా వివిధ కారణాలతో ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. మంజూరైన ఉత్తర భాగాన్నే కేంద్రం ఆశించిన సమయానికి నిర్మించలేని కారణంగా.. దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే నిర్మిస్తే ఎలా ఉంటుందని కూడా సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాల్సి వస్తే తీసుకోవాల్సిన చర్యలు, రహదారి నిర్మాణంతో పాటు అభివృద్ధి అంశాలపైనా అధ్యయనం చేసేందుకే అధికారులతో కమిటీని నియమిస్తున్నట్లు సమాచారం. కాగా, దక్షిణ భాగం రహదారిని సొంతంగానే నిర్మిస్తే ఎలా ఉంటుంది? కేంద్రం నిర్మిస్తే ఎలా ఉండబోతుందన్న దానిపై శుక్రవారం నిర్వహించబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. రహదారిని ఎవరు నిర్మించినా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్న భూములు లేకుండా వ్యవసాయేతర, అటవీయేతర భూములుంటే ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఈ దక్షిణ భాగంపై ప్రాథమికంగా ఒక రూట్‌మ్యాప్ ఉన్నా అది ఖరారు కాలేదు. దీంతో ఇప్పుడు తాజాగా మరో అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం ఖరారు చేయనున్నట్లు సమాచారం. తాజా అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు ఉండనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉన్న రూట్ మ్యాప్ ప్రకారం ఈ రహదారి చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగం రహదారికి అనుసంధానం కానుంది. ఇది మొత్తం 194 కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. దీని నిర్మాణానికి దాదాపు 2 వేల హెక్టార్ల భూమి అవసరమవనుంది. భూ పరిహారం కింద రూ.6,500 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉండగా.. మొత్తం రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు కావాలని అధికారుల ప్రాథమిక అంచనాల్లో తేలినట్లు సమాచారం.

పారిశ్రామిక కారిడార్లు.. రైతులకు వాటా!

దక్షిణ భాగం మంజూరు, ప్రాథమిక అలైన్‌మెంట్ నేపథ్యంలో ఈ రహదారికి ఇరువైపులా రెస్టారెంట్లు, బాంక్వెట్ హాళ్లు, స్టార్ హోటళ్లు సహా వాణిజ్య వ్యాపారాలకు అనుకూలంగా నిర్మించాలని కేంద్రం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. అంతేకాకుండా రహదారికి ఇరువైపులా అభివృద్ధి కోసం సేకరించిన భూముల్లో రైతులకు కొంత వాటాను అందించాలని కూడా కేంద్రం భావించినట్లు సమాచారం. అదే సమయంలో జాతీయ రహదారుల నిబంధనల్లో వచ్చిన పలు మార్పుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణకు ముందుగానే పరిహారానికి సంబంధించిన నిధులను కేంద్రానికి డిపాజిట్ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే అసలు దక్షిణ భాగాన్ని సొంతంగా నిర్మిస్తే ఎలా ఉంటుందని సర్కారు అంచనా వేస్తోంది. రోడ్డు కోసం సేకరించే భూములు కాకుండా దానికి అదనంగా ఇరువైపులా మరికొన్ని భూములను సమీకరించాలనే భావనలో ఉంది. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు, బెంగళూరు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు ఈ మార్గం అనుకూలంగా ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ పార్కులు, శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసే విధంగా ఆలోచనలు చేస్తోంది. భూములను సమీకరించి పెద్దపెద్ద కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టించేందుకు అవకాశం ఉంటుందని కూడా భావిస్తోంది. అంతేకాకుండా సమీకరించిన భూములను లే అవుట్‌లుగా మార్చి, ఎకరాల వారీగా వెంచర్ వేయనున్నారు. అలా వేసిన వెంచర్లలో భూమి యజమానికి కొంత వాటా ఇచ్చి, ప్రభుత్వం కొంత వాటా తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ అంశాలన్నింటిపైనా కమిటీ అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.

గోవాలో జానీ మాస్టర్ అరెస్టు

- నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

నార్సింగ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీబాషా అలియాస్ జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకొస్తున్నామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. జానీ మాస్టర్‌పై ఈ నెల 15న రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ కాగా, అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారని ఆయన వెల్లడించారు. జానీమాస్టర్‌ను శుక్రవారం రాజేంద్రనగర్ కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. కాగా.. జానీ మాస్టర్ భార్య ఆయేషా గురువారం నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులతో మాట్లాడిన అనంతరం ఆమె తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. జానీ మాస్టర్ అరెస్ట్ విషయం తనకు తెలియదని.. తనకు వచ్చిన ఒక ఫేక్ కాల్ గురించి తెలుసుకునేందుకే ఠాణాకు వచ్చానని ఆమె మీడియాకు చెప్పారు. అయితే.. జానీ మాస్టర్ అరెస్టు గురించి పోలీసులు ఆయన భార్యకు సమాచారం ఇచ్చి, పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు తీసుకుని పంపించినట్టు సమాచారం.

పిల్లలకు నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

- యూకే వైద్య బృందం ఆధ్వర్యంలో 22 నుంచి శిబిరం
- 15 ఏళ్ల లోపు వారికి ఉచితం..80 మంది పేర్లు నమోదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 15 ఏళ్ల లోపు చిన్నారులకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి అండగా నిలుస్తుంది. హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఒక రోజు నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు నిమ్స్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారు. డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలోని యూకే వైద్య బృందం, నిమ్స్ వైద్యులతో కలిసి ఈ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుంది. ఆదివారం(22వ తేదీ) నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ ప్రత్యేక శిబిరం జరగనుంది. ఈ శిబిరంలో వైద్యం చేయించుకునేందుకు ఇప్పటికే 80 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా చిన్నారులను వైద్యులు పరీక్షించి శస్త్ర చికిత్స తేదీ నిర్ణయించి ఆ ప్రకారం చికిత్స నిర్వహిస్తారు. ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి కోరారు. కాగా, యూకే బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గత శిబిరంలో 180 మందికి శస్త్ర చికిత్సలు చేశామని నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు చెప్పారు.

హైకోర్టులో డీసీ ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చారని పేర్కొంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చేసిన ఫిర్యాదుతో తనపై నమోదైన క్రిమినల్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ నందగిరి సుదాన్ష్ హైకోర్టులో పిటిషన్ వేశారు. హైడ్రా ఫిర్యాదుతో పెట్టిన కేసుకు, తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఉల్లంఘనలు జరిగిన సమయంలో తాను చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా లేనని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థినులకు విప్రో స్కాలర్‌షిప్

పదోతరగతి, ఇంటర్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ప్రస్తుతం ఫుల్‌టైం డిగ్రీ చదువుతున్న విద్యార్థినులకు విప్రో కన్స్యూమర్ కేర్ 9వ ఎడిషన్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విప్రో కన్స్యూమర్ కేర్ గ్లోబల్ హెడ్ నారాయణ్, విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీరజ్ ఖత్రి వివరాలు ప్రకటించారు. ఈసారి 1500 మందికి ఉపకార వేతనాలు అందిస్తామని ప్రకటించారు. ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేసి ఏడాదికి రూ. 24వేల చొప్పున అందిస్తామన్నారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్, సైన్స్ ఆసక్తిగలవారు ఈనెల 30లోపు సంతూర్ స్కాలర్‌షిప్స్ డాట్ కాం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట 8 శుక్రవారం 20 సెప్టెంబరు 2024

వైభవోపేతంగా గణేష్ నిమజ్జనం



అశ్వారావుపేట టౌన్ సెప్టెంబరు 19: పట్టణంలోని దండాబత్తుల వారి వీధిలో. ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి గురువారం నిమజ్జన కార్యక్రమం జరిగింది. గురువారం ఉదయం పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాయి చాలీస, శ్రీరామ నామ జపం, హనుమాన్ చాలీసాను పఠించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అనంతరం గణనాధుడిని పురవీధుల్లో మేళతాళాల, యువతీ యువకుల నృత్యాలమధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని భక్తులను, యువతను ఉత్సాహపరుస్తూ నినాదాలిచ్చారు. అనంతరం వెంకమ్మ చెరువులో గణ నాధుడిని నిమజ్జనం చేశారు.

పర్యాటక కేంద్రాలుగా చెరువులు

- మూడు చెరువుల అభివృద్ధిపై పాయం సమీక్ష
- స్పందించిన అటవీశాఖ అధికారులు



ఫారెస్టు డివిజన్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మణుగూరు, సెప్టెంబరు 19: మణుగూరు అశ్వాపురం మండలాల్లో పెద్ద చెరువులుగా గుర్తింపు ఉండి స్థానిక రైతాంగానికి విరివిగా సాగునీటినందిస్తున్న చెరువులు మరో కొత్త శోభను సంతరించుకోనున్నాయి. సాగు నీటి వనరును రైతులకు అందిస్తూనే.. పర్యాటక కేంద్రాలుగా రూపు దిద్దుకోబోతున్నాయి. మండలంలోని పేరంటాల చెరువు, రేగుల గండి చెరువులను అభివృద్ధి చేసి బోట్ షికార్ పెట్టేందుకు ప్రణాళికలు తయారు చేయనున్నారు. ఈ మేరకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఫారెస్టు డివిజన్ అధికారి మక్సూద్ మోహినుద్దీన్‌లతో పాటు ఇరిగేషన్ అధికారులతో కూడా సమీక్షను నిర్వహించారు. మణుగూరు మండలంలో ఈ రెండు చెరువులతో పాటు అశ్వాపురం మండలంలోని తుమ్మల చెరువును కూడా ఇదే విధంగా తీర్చి దిద్ది భుహుళ ప్రయోజనాన్ని ప్రజలకు అందించబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రాంతానికి దగ్గరగా ఉంటూ పచ్చని అడవుల ప్రశాంతమైన వాతావరణంలో ఇవి ఉండటం ఓ విశేషం.. దీనికి తోగు పెద్ద చెరువులుగా గుర్తింపు ఉంది. పలు పరిశ్రమల కార్మికులు ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో పాటు స్థానిక ప్రజలు వారి కుటుంబాల వారు, పర్యాటకులకు ఇలాంటి ఏర్పాట్లు ఎంతో అహ్లాదాన్ని కల్పించబోతాయని తెలిపారు. ప్రణాళికలు సిద్దంమై త్వరలోనే వీటి అభివృద్ధి చర్యలు సిద్ధం అవుతాయని ఎమ్మెల్యే పాయం తెలిపారు. డివిజన్ ప్రజలకు పిక్నిక్ స్పాట్స్ గా ఇవి మునుముందు ప్రాచుర్యం పొందగోరనున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని ఫారెస్టు డివిజన్ అధికారి మక్సూద్ మోహిద్దీన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అశ్వాపురం: పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.గురువారం మండల పరిధిలోని మొండికుంట, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు బూరెడ్డి వెంకట్‌రెడ్డి, ఓరుగంటి రమేష్‌సామకూరి వెంకన్నవీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష

ఆళ్లపల్లి: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం ఆళ్లపల్లి మండలంలో పర్యటించనున్నారని ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రచారకమిటి అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ తెలిపారు. మర్కోడు, పాతూరు, రామవాపురం, రామానుజగూడెం గ్రామాల్లో సమస్యలపై అధికారులతో సమిక్ష, పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎస్పీ చెక్కుల అందజేత

కొత్తగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన ఏఎస్‌ఐ చీమా కుటుంబానికి, చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండుపోటుతో మృతి చెందిన ఏఎస్‌ఐ శ్రీనివాసరావు కుటుంబాలకు గురువారం ఎస్పీ రోహిత్‌రాజ్ తన కార్యాలయంలో భద్రత సంక్షేమ నిధి నుంచి చేయూత ఫండ్ ద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- పినపాక ఎమ్మెల్యే పాయం
- మణుగూరులో మండల స్థాయి క్రీడలు ప్రారంభం
- ఇల్లెందులో అసౌకర్యాల నడుమ క్రీడలు



క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు/బూర్గంపాడు/ఇల్లెందుటౌన్/పినపాక, సెప్టెంబరు 19: మణుగూరు జడ్పీ పాఠశాలలో గురువారం నుంచి మండల స్థాయి క్రీడలు ప్రారంభం అయ్యాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ఈ క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. జడ్పీ పాఠశాలలో చక్కటి మైదానాన్ని వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షల నిధులను కేటాయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలకు దీటుగా వసతులు ఏర్పాటు చేసి మంచి విద్యను అందించేందుకు లక్షలాది రూపాయలను కేటాయిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ పోటీల్లో మొత్తం 36 పాఠశాలలు పాల్గొంటున్నట్లు ఎంఈవో వీరాస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ వీరాస్వామి స్పెషల్ అధికారులు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిఈటిలు. పిడిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి

బూర్గంపాడు: విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎంఈవో సమ్మయ్య అన్నారు. గురువారం బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యాతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నాతో కలిసి క్రీడా మాంత్రికుడిగా పేరొందిన మెజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవిలాదేవి, ఎస్టీఎఫ్ జిల్లా సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.



ఏడూళ్లబయ్యారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

క్రీడలు క్రమశిక్షణను పెంపొందించాలి

ఇల్లెందు టౌన్: క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించాలని మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సింగరేణి జీఎం జాన్ ఆనంద్‌లు సూచంచారు. గురువారం మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలను సింగరేణిగ్రౌండ్‌లో ప్రారంభించి అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని వివరించారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు క్రీడలపై మక్కువ పెంపొందించుకోవాలని కోరారు. పలు రకాల క్రీడల ద్వార శరీరదారుఢ్యంతోపాటు ఆరోగ్యంగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంఈవో పి. కృష్ణయ్య, ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, క్రీడల నిర్వహకులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పాఠశాలల క్రీడలు

పినపాక: మండలంలోని జానంపేట జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ముగిశాయి. క్రీడల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటి జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. బాలికల విభాగం క్రీడా పోటీల్లో ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు సత్తా చాటారు. బాలుర విభాగంలో ఏడూళ్లబయ్యారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సీనియర్ బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో క్రీడల్లో ప్రథమ స్థానంలో, వాలీబాల్ ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. అలాగే ఏడూళ్లబయ్యారం రాధిక కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థులు కబడ్డీ వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ చాటి, జోనల్ స్థాయి క్రీడా పోటీలకు సీనియర్స్ విభాగంలో ఏడుగురు, జూనియర్స్ విభాగంలో ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది. ఏడూళ్లబయ్యారం జడ్పీ పాఠశాల విద్యార్థులను హెచ్ఎం ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మండల పాఠశాలల క్రీడల కన్వీనర్ కే విజయలక్ష్మీ, ఎంపీఓ కే వెంకటేశ్వరరావు, మండల నోడల్ ఆఫీసర్ కె నాగయ్య, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ కె రాములమ్మ, పీడీలు కె ఆదినారాయణ, పి అనిల్‌కుమార్, బి వీరన్న, బాలరాజు, హెచ్ఎం రమణ, పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ పాఠశాలల క్రీడలు

ఇల్లెందు టౌన్, సెప్టెంబర్ 19: ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలల మండల స్థాయి క్రీడలకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. మైదానంలో కూర్చునేందుకు టెంట్లు సరిపడ వేయకపోవడంతో విద్యార్థులు ఎండలో విలవిలాడిపోయారు. నాణ్యతలేని భోజనం ఇచ్చారని, చల్లటి నీళ్ల ఏర్పాటు చేయలేదనే విమర్శలు వచ్చాయి. కాగా, క్రీడల నిర్వహణ పేరిట కొందరు వ్యక్తుల వద్ద, ప్రైవేటు పాఠశాలల వద్ద అక్రమ వసూళ్లు చేశారని, క్రీడల్లో పాల్గొనే పాఠశాలల జట్ల నుంచి రూ. 1000 చొప్పున ఎంట్రీ ఫీజులను తీసుకున్నారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ ఆరోపించారు.



గడ్డిలోనే కబడ్డి ఆడుతున్న బాలికలు

జ్వరంతో టీజేఎస్ నాయకుడు మృతి

అశ్వాపురం సెప్టెంబరు 19: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన తెలంగాణ జనసమితి మండల నాయకుడు పిప్పళ్ల శ్రీనివాస్ (50) తీవ్ర జ్వరంతో గురువారం మృతి చెందాడు. శ్రీనివాస్ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించటంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని టీజేఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జేతం రామకృష్ణలు సందర్శించి నివాళులర్పించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు, సెప్టెంబరు 19: ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని సాయిరాంతండా గ్రా సమీపంలో గురువారం జరిగింది. వికారాబాద్ జిల్లా చౌడపుర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బాబాయి, కొడుకు కె.కృష్ణయ్య, శ్రీనులు కలసి క్యాటరింగ్ చేసేందుకు ఆటోలో కొత్తగూడెం వెళుతున్నారు, ఈ క్రమంలో సాయిరాంతండా సమీపంలో ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

నలుగురు మావోయిస్టు మిలిషియ సభ్యుల అరెస్టు

- ఒక డీసీఎం, రెండు పడవలు, రెండు ట్రాక్టర్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాచలం ఏఎస్పీ అంకిత్

చర్ల, సెప్టెంబరు 19: భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని చింతగుప్ప, బోదనెల్లి అటవీ ప్రాంతంలో నలుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులను అరెస్టు చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంక్వార్ తెలిపారు. చర్ల పోలీసుస్టేషన్‌లో గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బోదనెల్లి అటవీప్రాంతంలో పోలీసు బలగాలు ఏరియా డామినేషన్ చేస్తుండగా జామాయిల్ తోట సమీపంలో కొందరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించగా మిలీషియా సభ్యులుగా తేలింది. పట్టుబడిన వారిలో ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు ప్రాంతానికి చెందిన పొడియం సమ్మయ్య, గట్టుపల్లి రమేష్, కిష్టారం ప్రాంతానికి చెందిన పూనెం రూపేష్, వెడమ్ శ్రీనులని ఏఎస్పీ వివరించారు. వీరి నుంచి ఒక డీసీఎం వాహనం, రెండు ట్రాక్టర్లు, గోదావరి దాటేందుకు ఉపయోగించే రెండు పడవలను, రెండు కార్డెక్స్ వైర్ బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. నిషేధిత మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న అజ్ఞాత నాయకులు, సభ్యులు జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. అమాయక ఆదివాసీ ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.

లారీని డీకొట్టి యువకుడి దుర్మరణం



చైతన్య (ఫైల్)

దమ్మపేట, సెప్టెంబరు 19: ఆగివున్న లారీని డీకొట్టి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి నెమిలిపేట గ్రామ సమీపంలో జరిగింది. ఈఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుర్వాయిగూడెం గ్రామానికి కీసరి బాబూరావు కుమారుడు కీసరి చైతన్య (20) ద్విచక్రవాహనంపై గుర్వాయిగూడెం నుంచి దమ్మపేట వస్తుండగా నెమలిపేట గ్రామసమీపంలో ప్రధాన రహదారిపై జామాయిల్ లోడుతో ఆగివున్న లారీని వెనుకనుంచి డీకొట్టాడు. ఈఘటనలో చైతన్యకు తలకు తీవ్రగాయాలు అయి రక్తస్రావం కావటంతో స్థానికులు గమనించి వెంటనే దమ్మపేట వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి అశ్వారా వుపేట వైద్యశాలకు తరలించగా పరిశీలించిన డాక్టర్లు మృతి చెందినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరం ఒక మొక్కనాటుదాం.. అమ్మపేరు మీద

- అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 19: ప్రతి ఒక్కరం ఒక మొక్క నాటుదాం.. అమ్మపేరు మీద అని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన అన్నారు. స్వచ్ఛతాహి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధి శ్రీనివాసకాలనీ డీఆర్‌సీసీ వద్ద గురువారం మొక్కను నాటి కార్యక్రమం ప్రారంభించారు. డీఆర్‌సీసీ ప్రాసెస్, కంపోస్టు యార్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలుచేశారు. అదేవిధంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఢాకునాయక్, డిఈ స్వరూపరాణి, మేనేజరు ఎల్‌వి. సత్యనారాయణ, ఎఈ రాము. శానిటరి ఇన్‌స్పెక్టర్ కేవీ. లక్ష్మణరావు, పర్యావరణ ఇంజనీరు ఫరీద్, మెప్మా డీఎంసీ రాజేష్, మున్సిపల్ వార్డు అధికారులు, జవాన్లు, సిబ్బంది, మహిళ సంఘాల వారు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రాజకీయాలకు దిక్సూచీ ఏచూరి: ఎస్ఎఫ్ఐ

చుంచుపల్లి, సెప్టెంబరు19: ప్రజాస్వామ్య రాజకీయాలకు దిక్సూచి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళంగి హరికృష్ణ గురువారం అన్నారు. సురక్ష ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. ఏచూరి జీవితం నేటి విద్యార్థులకు, యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని కొనియాడారు. మతోన్మాదం ఎండగట్టడంతో ఎంతో పోరాడారన్నారు. దేశ ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించే ఒక ఉద్యమ శిఖరం సమాజం కోల్పోయిందన్నారు. ఏచూరి ఆశయాల కోసం పోరాడడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళ్ళు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు ముందస్తు అరెస్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు19: కొత్తగూడెంలో బిజెపి నాయకులను వన్ టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టులను గురువారం చేశారు. రైతుల రుణ మాఫీ సరిగా కావడం లేదని భద్రాద్రి జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోతున్న రైతులకు అండగా అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. అరెస్ట్ అయిన వారిలో కొత్తగూడెం టౌన్ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్‌యాదవ్, నాయకులు బాణోత్ శ్రీనివాస్ నాయక్, చిట్టిరామవరం, గుగులోత్ లక్ష్మణ్‌నాయక్, దామారా లెనిన్ జాన్‌లు ఉన్నారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరిస్తా: డీఎంహెచ్‌వో

గుండాల/ఆళ్లపల్లి, సెప్టెంబరు 19; మారుమూల ఏజన్సీ ప్రాంతమైన గుండాల మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కరిస్తానని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను నవచైతన్య యువజన సంఘం యువకులు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందిచారు. మందులను పంపిస్తామన్నారు. ఆసుపత్రిలోని మలేరియా, టైఫాయిడ్ పరీక్ష యంత్రం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో కలెక్టర్ మరో యంత్రాన్ని పంపించారన్నారు.

ఆళ్లపల్లి: ఆళ్లపల్లి పీహెచ్‌సీని గురువారం డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై వారితో మాట్లాడారు. అనంతరం వార్డులను, డెలివరి, మందుల గదిని పరిశీలించారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు బాలాజీ, సాయి కళ్యాణ్, పీహెచ్‌సీ వైద్యులు సంగమిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట టౌన్: అశ్వారావుపేట మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో పీజీటీ ఇంగ్లీష్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 25 వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీ, బీఎడ్ ఆంగ్లం, మెథడాలజీ అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డీఐఈవో ఆకస్మిక తనిఖీ


దుమ్ముగూడెం సెప్టెంబరు 19: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ వెంకటేశ్వరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల పరిస్థితులను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. తరగతుల్లో అధ్యాపకుల బోధనను పరిశీలించారు. పూర్తయిన సిలబస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చూడాలని సూచించారు.ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెంచ్ పనులను పరిశీలించిన సీసీఎఫ్

దుమ్ముగూడెం సెప్టెంబరు 19: దుమ్ముగూడెం అటవీరేంజి పరిది దేవరపల్లి సెక్షన్‌లోని ఆక్రమణకు గురైన రిజర్వ్‌ఫారెస్టు భూములకు రక్షణగా చేపట్టిన కందకం పనులను సీసీఎఫ్ బి భీమానాయక్ గురువారం సందర్శించారు. అడవుల సంరక్షణ దిశగా స్థానిక ఆదివాసీలు, గొత్తికోయ ఆవాసప్రాంతాల వారికి అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం చర్ల అటవీరేంజిను పరిశీలించారు. డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓ సుజాత, దుమ్ముగూడెం రేంజి అధికారి కమల, ఆర్‌కొత్తగూడెం సెక్షన్ సిబ్బంది ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించేందుకు నూతనక్లబ్ ఏర్పాటు

- నూతన అధ్యక్షుడు అంకత ఉమామహేశ్వరరావు



ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

దమ్మపేట, సెప్టెంబర్ 19 : దమ్మపేట ప్రాంతంలో లైన్స్‌క్లబ్ సేవలు విసృతంగా అందించేందుకు క్లబ్ ఏర్పాటు చేసినట్లు నూతన అధ్యక్షుడు అంకత ఉమా మహేశ్వరరావు అన్నారు. 30మంది సభ్యులతో దమ్మపేటలో నూతన లయన్స్ క్లబ్ ఏర్పాటు చేయగా సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం రాత్రి స్థానిక రైతువేదికలో జరిగింది. నూతన అధ్యక్షుడు అంకత మహేశ్వరరావు మాట్లాడుతు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న లైన్స్ క్లబ్‌లకు ఎంతో కొంత మేర ప్రజలకు సేవ చేసే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ దమ్మపేటలో ఏర్పాటు చేశామన్నారు. సేవే లక్ష్యంగా దమ్మపేట క్లబ్ ఆదర్శవంతంగా గుర్తింపు తేచ్చే విధంగా సేవా కార్యక్రమాలు అందిస్తామని అన్నారు. క్లబ్ ప్రధానకార్యదర్శిగా రాసూరి వేణుగోపాలరావు, కోశాదికారిగా పసుమర్తి మక్తేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో లయన్ దారా కృష్ణారావు, కాపా మురళీకృష్ణ, సింహాద్రి శంకరరావు, దారా యుగంధర్, సత్తుపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ వెంకటరమేష్, దాసరి ఉమామహేశ్వరరావు, మాజీ జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, చిన్నశెట్టి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

దుమ్ముగూడెం సెప్టెంబరు 19:మండల పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక గురువారం ప్రాంతీయ కార్యాలయంలో జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తాళ్లూరి వంశీమోహన్, డి.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షునిగా డిమల్లిఖార్జునరావు, కార్యదర్శిగా నాగరాజులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కారంపూడి దశంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరవి, జ్యోతికుమార్, శ్రీనివాస్, శివలు పాల్గొన్నారు.

సేవలకు ఘన నివాళ్లు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 19: వైద్య, విద్యా, రాజకీయ సేవా రంగాలలో విశేష సేవలు అందించి ఆకస్మికంగా మృతి చెందిన డాక్టర్ విజేందర్‌రావు, ఉద్యమకారుడు రామలక్ష్మణ్, గాయకులు ప్రసాద్‌లకు గురువారం కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమంలో సంస్మరణ సభ నిర్వహించి నివాళ్ళు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరికి తోచిన సహాయ సహకారాలు అందిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని వీరిని కొనియాడారు. డాక్టర్ బత్తుల కృష్ణయ్య, జెబి.శౌరీ, నాగా సీతారాములు, యెర్రా కామేష్, సుగుణారావు, మల్లెల రామనాధం, సంఘం వెంకటపుల్లయ్య, మారపాక రమేష్, మొక్కల రాజశేఖర్, సైమన్, మొక్కల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్ అనుమతుల పరిశీలన

దుమ్ముగూడెం సెప్టెంబరు 19:మండల పరిది కన్నాపురం సర్వేనెంబరు 18-3 భాగంలో నిర్మించిన పెట్రోల్‌బంక్ నిర్మాణ అనుమతుల్ని జాయింట్ కలక్టర్ వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. నిర్మాణ స్థలం, లీజు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ రికార్డులను చూశారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ ఐలువెంకటేశ్వరావు, నర్సింహారావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అశ్వారావుపేటలో ఇద్దరు పాఠశాల విద్యార్థుల అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- అదృశ్యమైన విద్యార్థులు ఏపీలోని నర్సీపట్నంలో ప్రత్యక్షం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 19: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం తరువాత అదృశ్యమయ్యారు. పాఠశాలలో కొందరు విద్యార్థులు సిగరేట్ తాగడంతో పాటు ఇతర మత్తుపానీయాలు తీసుకున్నారనే సమాచారంతో ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ ఇచ్చే క్రమంలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. 16వ తేదీ సోమవారం పాఠశాలకు సెలవు కావడంతో బయట వ్యక్తులు కొందరు స్థానిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలోకి వెళ్లారు. ఈ క్రమంలో వారిలో కొందరు మత్తు పద్దార్థాలను సేవిస్తుండగా, అదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కొందరు చూసి మంగళవారం పాఠశాల హెచ్ఎం హరిత, ఉపాధ్యాయులకు తెలిపారు. దీంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి పాఠశాలకు రావాలని సూచించారు. ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు రాగా ఉపాధ్యాయులు వారితో మాట్లాడి జరిగిన విషయాన్ని చెప్పారు. దాంతో మరోసారి ఇలా జరగకుండా చూస్తామని తల్లిదండ్రులు హామీ ఇవ్వడంతో వారిని ఆ ముగ్గురిని పాఠశాలకు అనుమతించారు. ఈ క్రమంలో అశ్వారావుపేటకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులను వారి తల్లి దండ్రులు వచ్చేంత వరకు పాఠశాల కార్యాలయంలో కూర్చోవాలని సూచించారు. అయితే కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో ఇద్దరు విద్యార్థులు బయటకు వెళ్లిపోయారు. దాంతో ఈ విషయాన్ని ఉపాధ్యాయులు సదరు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. బయటకు వెళ్లిన విద్యార్థుల ఆచూకీ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గురువారం ఉదయం వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పాఠశాల హెచ్ఎం హరిత మాట్లాడుతూ బయట వ్యక్తులు కొందరు తమ పాఠశాల విద్యార్థులను పాఠశాలలోకి తీసుకువచ్చి మత్తుపదార్థాలు తాగుతున్నారనే సమాచారంతో విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు గాడి తప్పకూడదనే ఉద్దేశంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. సెలవు దినాల్లో కొందరు బయట వ్యక్తులు పాఠశాలలోకి వస్తున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నర్సీపట్నంలో ప్రత్యక్షం

అశ్వారావుపేటలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు ఏపీలోని వైజాగ్ సమీపంలో నర్సీపట్నంలో ఉన్నట్లుగా గురువారం సమాచారం అందింది. విద్యార్థులు బుధవారం వైజాగ్ వెళ్లి అక్కడ నుంచి బంధువుల ఇంటికి వెళ్లినట్లుగా గుర్తించారు. బంధువుల సమాచారంతో విద్యార్థుల ఆచూకీ లభించటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పాఠశాల

అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ కొందరు వ్యక్తుల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే ఆవరణలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల ఉండటంతో నిత్యం గేట్లు తీసే ఉంచుతున్నారు. దీంతో సెలవు దినాల్లో పాఠశాలలోకి ఎవరు వస్తున్నారో, ఎవరు వెళుతున్నారో తెలియని పరిస్థితి. దీనికితోడు బయట ప్రాంతాల్లో మద్యం, గంజాయి వంటివి సేవించినా పోలీసులకు పట్టుబడటం, ఇతరులు చూడటం వంటివి ఉంటాయి. ఇదే పాఠశాలలో అయితే ఎవరూ ఉండరు, ఇటువంటి ఇబ్బంది ఉండదని భావిస్తున్న కొందరు పాఠశాల ఆవరణలోకి వచ్చి సిగరేట్, మద్యం తాగుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోలీసులు కూడా ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నష్టపోయిన పామాయిల్ రైతును ఆదుకోండి

అశ్వారావుపేట, సెప్టెంబరు 19: గెలలు వేయని మొక్కలు (హాఫ్‌లైఫ్)తో నష్టపోయిన రైతును ఆదుకోవాలని ఆయిల్ పామ్ గ్రోవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కె. పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన పుచ్చకాయల రమేష్‌రెడ్డికి ఆయిల్‌ఫెడ్ సరఫరా చేసిన మొక్కలతో వేసిన తోటలో గెలలు కాయని విషయాన్ని గతంలోనే ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులకు తెలియజేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఎన్ని దఫాలుగా వినతి చేసిన ఈ రైతుకు జరిగిన నష్టాన్ని పూడ్చటానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించడం జరిగిందని వివరించారు. కోర్టు నుంచి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని వచ్చిన తీర్పు కాపీని జతచేసి, ఛైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశామన్నారు.

సమస్యల గుర్తింపు కోసం రచ్చబండ

- నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఓ గ్రామం దత్తత తీసుకుంటా
- అశ్వారావుపేట మండలంలో చెన్నాపురం గ్రామం దత్తత తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే జారే వెల్లడి



రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, సెప్టెంబరు 19: సమస్యల గుర్తింపు కోసం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహణను చేపడుతు న్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఇప్పటికే మీ ఎమ్మెల్యే మీ ఇంటికి వంటి వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. అశ్వారావుపేట మండలం మారుమూల గ్రామమైన చెన్నాపురం గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. గురువారం చెన్నాపురం గ్రామానికి అన్ని శాఖల అధికారులతో కలసి వెళ్లి సమస్యల గుర్తింపు కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, మిగిలిన సమస్యల గుర్తింపు కోసం గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని వీధులన్ని తిరిగి గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నాపురం గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇదే విధంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రచ్చబండలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారాలపై వారితో పాటు ఉన్న అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.27.62లక్షలు మంజూరు

అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం ఎఫ్‌డీఆర్ నిధులు రూ.27.62 లక్షలు మంజూరి అయినట్టు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతిలో మాట్లాడారు. అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి మండలాలకు నిధులు మంజూరయ్యాయ న్నారు. ఈ నిధులు పీఆర్ నుండి మంజూరి అయినట్టు ఆయన తెలిపారు.

వీటితో పాటు సమీకృత ఆధునిక వ్యవసాయ విధానంలో ఆసక్తివున్న రైతులకు మునగ తోట వేసుకోవటానికి విత్తనాలు ఉచితంగా అందజేస్తామని, ఎకరం లోపు భూమి కలిగి జాబ్ కార్డు కలిగివున్న రైతులకు పుట్టగొడుగుల పెంపకం, వెదురు నర్సరీల పెంపకానికి విత్తనాలు ఉచితంగా అందజేస్తామన్నారు. చిన్న సన్నకారు రైతులకు ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రత్యేకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తిగలిగిన వారు ఆయా మండలాల్లోని ఏఓలను సంప్రదించాలని ఆయన తెలిపారు.